సాక్షి
నంద్యాల
సోమవారం : 11 డిసెంబర్ 2023



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు త్రయోదశి సందర్భంగా ఆదివారం శాస్త్రోక్తంగా అర్చకులు పరోక్ష సేవను నిర్వహించారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవను అర్చకులు నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



సుంకేసులకు నిలిచిన ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలిచి పోయింది. కేసీ కాల్వకు 221 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

కొలనుభారతి దేవి సేవలో లోకాయుక్త జస్టిస్



కొలనుభారతి అమ్మవారిని దర్శించుకున్న లోకాయుక్త జస్టిస్ దంపతులు

కొత్తపల్లి: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని కొలనుభారతిదేవి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయాన్ని చేరుకున్న వారికి పురోహితులు ఆలయ సంప్రదాయానుసారం స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించుకొన్నారు. అదేవిధంగా అక్కడే ఉన్న సప్తశివాలయాలలోని దేవతామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయ ఈఓ మోహన్ జస్టిస్ దంపతులను పూలమాల దుశ్శాలువలతో సత్కరించారు. ఈయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఉన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమానికి జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

837.20 అడుగులుగా డ్యామ్ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 837.20 అడుగులకు చేరుకుంది. జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పూర్తిగా నిలిచి పోయిన విషయంతెలిసిందే. శనివారం నుంచి ఆదివారం వరకు దిగువ ప్రాంతాలకు 3,674 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భజలవిద్యుత్ కేంద్రంలో 0.974 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, 1982 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 960 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 647 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 57.8098 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇండస్ట్రియల్ హబ్‌గా ఓర్వకల్లు

- ఐలా చైర్మన్ జీఆర్‌కే రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ), ఇండస్ట్రియల్ లోకల్ ఏరియా అథారిటీ (ఐలా) చైర్మన్ జీఆర్‌కే రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంతో పాటు వేలాది ఉద్యోగాల కల్పనలో భాగంగా ప్రభుత్వం ఓర్వకల్లును అభివృద్ధి చేస్తోందన్నారు. ఏవైనా పరిశ్రమలు రావాలంటే నీరు ముఖ్యమని, రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రత్యేక చొరవతో ముచ్చుమర్రి నుంచి పైపులైన్ ద్వారా నీటిని కేటాయించడం ఈ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. యువత పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేయాలన్నారు. ప్రభుత్వం నుంచి నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి కల్పించడం, జిల్లాలో డ్రైపోర్ట్, పారిశ్రామిక వాడల అభివృద్ధిలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్వతహాగా పారిశ్రామిక వేత్తగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ మెంబర్‌గా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జోనల్ కమిటీ మెంబర్‌గా తాను తీసుకెళ్లిన సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం శుభపరిణామమన్నారు.

వైభవంగా పద్మనాభ పూర్వారాధన

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి పద్మనాభతీర్థుల 700వ ఆరాధన వేడుకలు వైభవంగా జరిగాయి. కర్ణాటకలోని అనేగొంది నవబృందావన క్షేత్రంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల చేతుల మీదుగా వేడుకలు నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం పూర్వారాధన వేడుక గావించారు. ముందుగా పద్మనాభతీర్థుల మూలబృందావనానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి విశేష అలంకరణలు చేశారు. పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య పూర్వారాధన కనుల పండువగా సాగింది.

పేదల ఇంట వెలుగులు

- ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉచిత విద్యుత్ సరఫరా
- కరెంటు బిల్లుల కష్టాలను తొలగించిన ప్రభుత్వం
- 200 యూనిట్లలోపు వినియోగిస్తే నో బిల్
- ఒక కనెక్షన్‌కు నెలకు రూ.800కి పైగా భారం మోస్తున్న సర్కారు
- ఎంబీసీల షాపులకు 150 యూనిట్ల వరకు ఉచితమే
- ఉమ్మడి జిల్లాలో 1.88 లక్షల మందికి లబ్ధి

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలతో ప్రతి ఇంట వెలుగులు నింపుతోంది. ఓ వైపు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పగటి పూటనే 9 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి ఆదుకున్న జగనన్న ప్రభుత్వం మరో వైపు బడుగు, బలహీన వర్గాలు ఊరట చెందేలా విద్యుత్ సరఫరా చేస్తోంది. గత పాలకుల హామీలకే పరిమితమైన ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌ను వైఎస్సార్‌సీపీ సర్కారు నిరంతరంగా అమలు చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 1.88 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తోంది.





ఉచిత విద్యుత్ కనెక్షన్ పొందిన గృహం

కర్నూలు(రాజ్‌విహార్)/ నందికొట్కూరు: దళితుల బతుకుల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపింది. నెలనెలా గృహ విద్యుత్ బిల్లును చెల్లించాలనే ఆందోళన లేకుండా చేసింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడకం ఉచితం చేయడంతో ఆయా వర్గాలు ఎంతో ఊరట చెందుతున్నాయి. ఎలాంటి సమస్య లేకుండా విద్యుత్ శాఖ నాణ్యతతో అందిస్తుండటంతో ఒకప్పుడు చీకట్లో మగ్గిన ఆ కుటుంబాలు నేడు విద్యుత్ వెలుగుతో మురిసిపోతున్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1.88 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతోంది. ఇందులో 1.73 లక్షలు ఎస్సీలు, 14,721 ఎస్టీలు, ఎంబీసీలు 539 మంది ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200, ఎంబీసీల షాపులకు 150, ఎంబీసీల ఇళ్లకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. గత ప్రభుత్వం నెలకు 50 యూనిట్లలోపు సరఫరా చేయడంతో పాటు నిబంధనలు విధించేది. దీనికి తోడు వాడిన విద్యుత్‌కు సంబంధించిన సొమ్మును విద్యుత్ శాఖకు రీ ఎంబర్స్‌మెంట్ చేయకపోవడంతో సంస్థ బకాయిలతో నష్టాలు మూటకట్టుకుంది. ఇచ్చే అరకొర విద్యుత్‌ను సరైన ట్రాన్స్‌ఫార్మర్లు లేక లో ఓల్టేజీ ఇవ్వడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి రావడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచి దళితుల విద్యుత్ కష్టాలు పరిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల భారం లేకుండా చూసేందుకు వారి నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు పొంది 200 యూనిట్ల వరకు ఉచితం చేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీ కుటుంబాలు నాలుగున్నరేళ్ల నుంచి విద్యుత్ బిల్లుల ఆలోచన లేకుండా లక్షల కుటుంబాలు నిశ్చింతగా ఉన్నాయి. ఎన్నికల హామీలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేర్చి ప్రజల మన్ననలు పొందుతోంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అండగా నిలిచి ఆదుకుంటోంది. ప్రతి సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తూ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే ఎస్సీ, ఎస్టీ గృహాలకు, రజకులు, నాయీ బ్రాహ్మణుల దుకాణాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ఆయా వర్గాల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత విద్యుత్ లబ్ధిదారుల వివరాలు

డివిజన్	ఎస్సీలు	ఎస్టీలు	ఎంబీసీలు
ఆదోని	48,043	3,149	136
డోన్	23,368	3,210	23
కర్నూలు-1	20,437	913	23
కర్నూలు రూరల్	32,138	2,682	253
నంద్యాల	49,116	4,767	104
మొత్తం	1,73,102	14,721	539

ఏటా రూ.120 కోట్లు భరిస్తున్న ప్రభుత్వం

ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీల విద్యుత్ సరఫరా కోసం ఏటా రూ.120కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం భారం భరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ కనెక్షన్లకు ఇచ్చే 200 యూనిట్లు కాల్చితే ఒక కనెక్షన్‌కు నెలకు రూ.939 అవుంది. సగటున రూ.500 చొప్పున వేసుకున్నా 1,87,823 కనెక్షన్లకు నెలకు రూ.9,39,11,500 అవుతుంది. ఎంబీసీల దుకాణాలకు రూ.7.41లక్షలు, ఇళ్లకు రూ.3.80లక్షల చొప్పున నెలకు రూ.9,50,32,500 కాగా ఏడాదికి రూ.114.03 కోట్లు ప్రభుత్వం విద్యుత్ సంస్థకు చెల్లిస్తోంది.

తండ్రి బాటలోనే వైఎస్ జగనన్న



తండ్రి బాటలోనే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదవి చేపట్టినప్పటి నుంచి దళితులకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగు జాడల్లోనే సీఎం జగనన్న పయనిస్తున్నారు. దళితుల జీవన ప్రమాణాలు మెరుగు పరిచి వారి అభ్యున్నతికి పాటు పడుతున్న జగనన్న మేలు ఎన్నటికీ మరువలేం. ఎస్సీ, ఎస్టీ గృహాలకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడం శుభపరిణామం. – చింతల ఓబులేసు
ఓబులంపల్లె గ్రామం, ఆళ్లగడ్డ మండలం

పేదలకు అండగా నిలిచారు



మాట తప్పని మడమ తిప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలిచారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి 150 యూనిట్ల వరకు బార్బర్ షాపులకు ఉచిత కరెంట్ ఇస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కరెంట్ బిల్లు కట్టలేదు. జగనన్న రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. – మంగళి వెంకటేశ్వర్లు, పాములపాడు

200 యూనిట్లు ఎంతో మేలు



తెలుగు దేశం ప్రభుత్వంలో కరెంటు బిల్లు కట్టలేదని కనెక్షన్ కట్ చేశారు. రెండు బల్బులు, ఒక ఫ్యాన్ ఉన్న మా ఇంట్లో 50 యూనిట్లు వాడే అవకాశం లేదు. అన్యాయంగా బకాయిలు చూపించి వందలాది రూపాయలు బిల్లు చూపించి కట్టలేదని కరెంటు తొలగించారు. సీఎం వైఎస్ జగనన్న మాకు ఉచితంగా 200 యూనిట్ల కరెంటు ఇస్తునట్లు ప్రకటించడం హర్షించదగ్గ విషయం.
– శిఖామణి ఆత్మకూరు పట్టణం సీఎస్ఐ పాలెం

పైసా కట్టలేదు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి దళితులకు 200 యూనిట్లు పథకం ఇచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పైసా కూడా కరెంట్ బిల్లు కట్టలేదు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మాకు ఉచిత కరెంట్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారు. ఉచిత కరెంట్ ఇచ్చిన జగనన్నకు రుణపడి ఉంటాం.
– గరక మధన్ గుమ్మకొండ గ్రామం, డోన్ మండలం

ఉచిత విద్యుత్‌పై అవగాహన కల్పించాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారందరికీ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 200 లోపు విద్యుత్ వాడితే జీరో బిల్. ఆపై వాడితే చెల్లించాలని అవగాహన కల్పించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాణ్యతతో అందించేందుకు ఎస్సీ, ఎస్టీల కాలనీల్లో కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాట్లు చేశాం.
– ఎం. ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై
ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 17వ తేదీన కర్నూలులో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలపై అవగాహన కల్పించడం

ముఖ్య సమాచారం
అవగాహన సదస్సు తేదీ: డిసెంబర్ 17, 2023 (ఆదివారం)
వేదిక: టీజీవీ కళాక్షేత్రం, సీ క్యాంప్, కర్నూలు
సమయం: ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటి ఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్-1, గ్రూప్-2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత: ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరు కానున్నారు. ఆమె గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8179100598 నంబర్‌కు పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రధాన ప్రాత పోషించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సూరజ్ గ్రాండ్ హోటల్‌లో జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఆత్మీయ సమ్మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి నిరోధకానికి టీడీపీ నేత చంద్రబాబునాయుడు స్టేలు, కేసులు వేసి ప్రజల్లో జగనన్న పాలనపై ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. రాయలసీమకు హైకోర్టు తేవడానికి జగనన్న ఎంతో ప్రయత్నం చేశారని, దాన్ని నిలుపుదల చేయడానికి టీడీపీ నాయకులు కేసులు వేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వీటన్నింటిని తిప్పికొట్టే బాధ్యత వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులదని, ఈ మేరకు ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. ఏపీ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ భూ యాజమాన్యం చట్టం కింద జారీ చేసిన జీవో 512 విషయంలో టీడీపీ నాయకులు రైతులు, ప్రజలను మభ్యపెడుతున్నారని, ఈ ప్రయత్నం అడ్డుకునేందుకు న్యాయవాదులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో నామినేషన్ నుంచి ఓటింగ్ వరకు వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు ప్రణాళికలు సిద్ధం చేసుకొని పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు చేదోడుగా లా నేస్తం పథకాన్ని దేశంలోనే అమలు పరిచిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్ల నిధిని ఏర్పాటు చేసిన ఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నంద్యాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, లీగల్‌సెల్ నాయకులు సందానీ, సుగుణారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, ముక్కెర కృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, అశోక్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, నందికొట్కూరు బార్ అసోసియేషన్‌ల లీగల్‌సెల్ నాయకులు పాల్గొన్నారు.

ఆనందంగా జీవిస్తున్నాం



నా వయసు 66 ఏళ్లు. ఏ పని చేతకావడం లేదు. టీడీపీ హయాంలో వృద్ధాప్య పింఛన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ ఇంటికి వచ్చి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయించారు. ప్రతి నెలా ఒకటో తారీఖు పింఛన్ అందుతోంది. ఏ పని చేతకాని నాకు పింఛన్ ఆసరాగా నిలుస్తోంది. ఏటా రైతు భరోసా కింద రూ.13,500 ఇస్తున్నారు. నా భార్య ఎ.శంకుతలమ్మకు వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా కింద డబ్బు ఇస్తున్నారు. నా పెద్ద కుమారుడు వెంకటకృష్ణ దివ్యాంగుడు. అతడికి వికలాంగుల పింఛన్ వస్తోంది. చిన్న కుమారుడు విజయకృష్ణ ఇంటర్ చదవడానికి అమ్మఒడి డబ్బులిచారు. ఇప్పుడు బీ.టెక్ చేస్తున్నాడు. ఇలా మా ఇంట్లో ప్రతి ఒక్కరికీ ఏదో రూపంలో సీఎం వైఎస్ జగన్ సాయం చేశారు. ప్రభుత్వ పథకాల వల్లే మేం ఆనందంగా జీవిస్తున్నాం. – నాగానంది వెంకటేశ్వర్లు, బోయరేవుల గ్రామం, వెలుగోడు మండలం

జగనన్నతో వ్యవసాయం పండుగ





కుందూనది పరివాహక ప్రాంతంలో నాకు ఐదు ఎకరాల మాగాణి ఉంది. ఏటా నేను వరి సాగు చేస్తున్నాను. గతంలో పంటలు సరిగ్గా రాక మోటార్లకు విద్యుత్ బిల్లులు చెల్లించలేక వ్యవసాయమే వద్దనుకున్నాం. చాలా సార్లు అధికారులు మీటర్లను కూడా తీసుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. 2004లో రైతు పక్షపాతి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఉచిత విద్యుత్ ఇచ్చి ఆదుకున్నారు. అయినా అప్పుడు పగలు, రాత్రి రెండు విడతల్లో విద్యుత్ సరఫరా కావడంతో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మోటార్లను ఆన్ చేసుకుని పంటలను పండించుకునే వాళ్లం. ప్రస్తుతం జగనన్న వచ్చాక పగలే 9 గంటల విద్యుత్ ఇస్తుండటంతో ఎంతో ఆనందంగా పంటలను సాగు చేసుకుంటున్నాం. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తుండడంతో ఎలాంటి విష పురుగులు, విద్యుత్ షాక్‌కు గురికాకుండా మోటార్ల ద్వారా వరిని సాగు చేసుకుంటున్నాం. మాకు రైతుభరోసా, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ రుణాలను కూడా పొందుతున్నాను. ప్రభుత్వం అందించే ఉచిత విద్యుత్ పుణ్యమా అని ఈరోజు రైతులంతా నాలుగు మెతుకులు తింటున్నాం. – ఉసేనయ్య, రైతు త్రిప్పిపాడు, దొర్నిపాడు మండలం



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ పరీక్షలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఆంగ్ల, గణిత సామర్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఏటా సాక్షి పోటీలు నిర్వహిస్తుండటాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

8లో

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: ప్రజా సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలోని కర్నూలు ప్రధాన రహదారి పక్కన రూ. 36 కోట్లతో 110 గదులతో నిర్మిస్తున్న బీసీ రెసిడెన్సియల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల భవన నిర్మాణాలతో పాటు రూ. 4 కోట్లతో ఎంఎస్ఎంఈ సెంటర్, రూ. 35 కోట్లతో నిర్మిస్తున్న ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి బుగ్గన సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. అనంతరం బేతంచెర్ల పట్టణంలో రూ.78 లక్షలతో ఆర్అండ్‌బీ ఇన్స్‌పెక్షన్‌బంగ్లా పునరుద్ధరణ పనులను మంత్రి బుగ్గన పరిశీలించారు. భవన నిర్మాణ ఆకృతులలో పలు పనులలో స్వల్ప మార్పులు చేయాలని మంత్రి అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మంత్రి వెంట నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ మునిస్వామి, మంత్రి ఓఎస్డీ ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తజన సందోహం



భక్తులతో పోటెత్తిన పాతాళగంగ



క్యూలైన్‌లో వేచి వున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి వారం కావడంతో పరమేశ్వరుని దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా శ్రీగిరి చేరుకుంటున్నారు. దీంతో శ్రీశైలమహాక్షేత్రం భక్తజనసందోహంగా మారింది. కార్తీకమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా వచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి కృష్ణానదిలో దీపాలు వదిలారు. అనంతరం దేవస్థానం ఏర్పాటు చేసిన ఆలయ ఎదురుగా గంగాధర మండపం వద్ద ఆలయ ఉత్తర మాడ వీధిలోను కార్తీకదీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నోములు నోచుకున్నారు. అనంతరం మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలైన్‌వద్ద బారులు తీరారు. భక్తులరద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు నిండిపోయాయి. ఉచిత దర్శనానికి 4 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టింది.

క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే సన్మార్గం

● ఎలోహీమ్ చర్చి పాస్టర్ షాలేమ్ రాజు



దైవసందేశం ఇస్తున్న పాస్టర్ షాలేమ్ రాజు

కర్నూలు (టౌన్): ఆధ్యాత్మికతను కలిగి ఉంటేనే సన్మార్గంలో నడవచ్చని ఎలోహీమ్ చర్చి పాస్టర్ షాలేమ్ రాజు క్రైస్తవ యువతకు సూచించారు. ఆదివారం రాత్రి స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో సీ.సీ.వై.ఎఫ్ ఆధ్వర్యంలో యూత్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ దైవసందేశం ఇస్తూ ఎంతో మంది యువతలో ఆధ్యాత్మికత భావం లేకపోవడం వల్ల తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారన్నారు. క్రీస్తు మార్గంలో నడవకుండా వ్యక్తిగత ఇష్టాలతో యువత తప్పుదారి పడుతున్నారన్నారు. యేసు క్రీస్తు మరోసారి అవకాశం ఇస్తున్నారని, ఇప్పటికైనా ఇతరులకు మార్గదర్శకంగా జీవనం సాగించాలని సూచించారు. అనంతరం క్యాండిల్ వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ అనిల్ కుమార్, జీవన్‌రావు, పాస్కల్ ప్రకాష్, ఎలిజబెత్ బాస్కర్, స్టీఫెన్, విజయకుమార్, అఖిలేష్, ఆకాష్ పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిల నవనారసింహ క్షేత్రాలు భక్త జనసంద్రంగా మారాయి. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో చేసిన గోవిందా నామస్మరణతో ఆదివారం నల్లమల పులకించి పోయింది. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను అమృతవల్లీ అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరణ చేసి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్చారణలు.. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య శ్రీ స్వాతి, శ్రీసుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించి పూర్ణాహుతితో ఈ కార్యాక్రమాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి విశేష పుష్పాలంకరణ గావించిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాఢ వీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు.



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

'స్పెల్‌బీ'కి విశేష స్పందన

● విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు
● సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహణ





స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సాక్షి మీడియా కృషిచేస్తోంది. డ్యూక్స్ వ్యాఫీ ప్రధాన స్పాన్సర్‌గా, ట్రిప్స్ ఇంటర్నేషనల్ (రాజమండ్రి) స్కూల్ వారు అసోసియేట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పోటీలను సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర స్కూల్‌లో నిర్వహించారు. పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. స్పెల్‌బీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు ఇంగ్లీషు భాషపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నారు. మ్యాథ్స్‌బీ పరీక్షలతో గణితంలో మెలకువలను నేర్చుకున్నారు. వివిధ దేశాల్లో ఇలాంటి పోటీ పరీక్షలు జరుగుతున్నాయి. వీటి ముఖ్య ఉద్దేశం విద్యార్థిని పరిపూర్ణవంతుడిగా తీర్చిదిద్దడమే. అందులో భాగంగా 'సాక్షి' కూడా విద్యార్థుల్లో ఆంగ్ల పద సామర్థ్యాన్ని, గణిత పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఏటా ఈ పోటీలు నిర్వహిస్తుండటంతో మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.



పరీక్ష కేంద్రానికి చేరుకుంటున్న విద్యార్థులు



స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్.. మ్యాథ్స్ బీ సెమీ ఫైనల్

స్పెల్‌బీ క్వార్టర్ ఫైనల్ పోటీలకు మొత్తం 108 మంది విద్యార్థులు హాజరయ్యారు. క్యాటగిరీ–1లో 18, క్యాటగిరీ–2లో 25, క్యాటగిరీ–3లో 44, క్యాటగిరీ–4లో 21 మంది వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మ్యాథ్స్ బీ సెమీ ఫైనల్ పోటీలకు మొత్తం 26 మంది హాజరయ్యారు. క్యాటగిరీ–1లో 7, క్యాటగిరీ–2లో 8, క్యాటగిరీ–3లో 3, క్యాటగిరీ–4లో 8 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు మొదటి క్యాటగిరీగా, మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను రెండో క్యాటగిరీగా, ఆరు, ఏడు తరగతుల విద్యార్థులను మూడో క్యాటగిరీగా, ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులను నాలుగో క్యాటగిరీలుగా విభజించి వారి తరగతి, స్థాయికి తగ్గట్టుగా ఇంగ్లీషు, గణిత సామర్థ్యాలను పరీక్షించారు.

ప్రయోజనకరంగా మ్యాథ్స్‌బీ



సాక్షి మీడియా నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్ష రాశాను. ఈపరీక్ష ఎంతో ప్రయోజనకరంగా ఉంది. తరువాతి పరీక్షకు అర్హత సాధిస్తాననే నమ్మకం ఉంది. ఇలాంటి పోటీ పరీక్షల వల్ల కొత్త పదాలు, అర్థాలు, కొత్త ఫార్ములాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది.

– కావ్య, 9వ తరగతి, రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్, కర్నూలు

థ్యాంక్స్ టూ సాక్షి



ఇలాంటి పరీక్షను నిర్వహించినందుకు సాక్షికి థ్యాంక్స్. నాకున్న ఇంగ్లీష్ వర్డ్స్ మెమొరీని స్పెల్‌బీ పెంచింది. పదాలకు భిన్నమైన అర్థాలు తెలిశాయి. ఇది మంచి పోటీ పరీక్ష. తరువాతి రౌండ్‌కు అర్హత సాధిస్తానన్న నమ్మకం ఉంది.

– ఈశ్వర ప్రసాద్, 3వ తరగతి, లిటిల్ ప్లానెట్ స్కూల్, ఎమ్మిగనూరు

పదాలకు అర్థాలు తెలుస్తాయి



సాక్షి మీడియా నిర్వహిస్తున్న స్పెల్‌బీ పోటీ పరీక్షల్లో పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. ఈ పరీక్షల్లో అర్హత సాధిస్తాననే నమ్మకం ఉంది. స్పెల్‌బీతో ఇంగ్లీష్ పదాలు, అర్థాలు తెలుసుకుంటున్నాను. కొత్త పదాలు పరిచయం అవుతుండటంతో భాషాపరిజ్ఞానం పెంచుకుంటున్నాను.

– ఎం.సుహాష్, 4వ తరగతి, రవీంద్ర గ్లోబల్ స్కూల్.

నాలుగు క్వింటాళ్ల ఎండు మిర్చి చోరీ

ఎమ్మిగనూరు రూరల్: కర్నూలు రోడ్డులోని గ్రాండ్ మాల్ హోటల్ ఎదురుగా మైదానంలో ఆరబెట్టిన ఎండు మిర్చిని శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన రైతు బోయ శ్రీనివాసులు 5 ఎకరాలను కౌలుకు తీసుకుని మిరప సాగుచేశాడు. ఇటీవల కోత కోసి పండు మిర్చిని గ్రాండ్ మాల్ హోటల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆరబోసుకున్నాడు. ఆదివారం ఉదయంవచ్చి చూడగా దిగుబడులు తగ్గినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు అక్కడికి చేరుకుని సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా శనివారం రాత్రి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చినట్లు, కాసేపటికి పరుగెత్తిన దృశ్యాలను గుర్తించారు. దాదాపు నాలుగు క్వింటాళ్ల ఎండు మిర్చి చోరీకి గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో కస్తూర్బా సమీపాన ఆదివారం రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఉదయం డోన్ పట్టణం కొండపేటకు చెందిన వెంకట రాముడు, మాధురి, గణేష్ కార్తీక మాసం సందర్భంగా బొలెరాలో కొత్తూరు సుబ్బరాయుడు స్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్నారు. సొంత పనినిమిత్తం బైక్ వెళ్లిన పట్టణానికి చెందిన సుధాకర్ రోడ్డు దాటుంతుడగా బొలేరో వాహనం బొలెరా వాహనం ఢీకొంది. బొలేరా వాహనంలోని ముగ్గురికీ తీవ్ర గాయాలవ్వగా స్థానిక ఆసుపత్రికి తరలించారు. సుధాకర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి.

మత సామరస్యానికి దర్గాలు ప్రతీక

● ఢిల్లీ ఖాజా నిజాముద్దీన్ దర్గా పీఠాధిపతి సయ్యద్ ఖాజా మొహమ్మద్



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మత సామరస్యానికి దర్గాలు ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఢిల్లీలోని ఖాజా నిజాముద్దీన్ దర్గా పీఠాధిపతి సయ్యద్ ఖాజా మొహమ్మద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఖాదర్‌లింగస్వామి దర్గాను సందర్శించి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఈయనకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా, పీఠాధిపతి ఖాదర్‌బాషా, శిష్య బృందం స్వాగతం పలికారు. దర్గాలో ఫాతెహాల అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాదర్‌లింగస్వామి దర్గాను కులమతాలకు అతీతంగా ప్రజలు దర్శించుకోవడం శుభపరిణామం అన్నారు. ఇటీవల నిర్మించిన మజ్జీద్‌లో దర్గా ధర్మకర్త మున్నపాషాకు ఖురాన్‌ను అందజేశారు. కార్యక్రమంలో కర్ణాటకలోని సర్మస్‌వలి దర్గా నిర్వాహకుడు దూద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రైల్వే గేట్ల వద్ద రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. సంజీవనగర్ కాలనీకి చెందిన నాగరాజు (60) ఆదివారం డోన్ క్రాస్ రోడ్డులో ఉన్న తన దుకాణానికి వెళ్లే క్రమంలో గేట్లు దాటుతుండగా నంద్యాల వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టింది. ప్రమాదంలో మృతుడి శరీర భాగాలు రైలు పట్టాల వెంట చెల్లాచెదురుగా పడ్డాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు, రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్‌పీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సామాజిక న్యాయం ప్రభుత్వ లక్ష్యం

● కర్నూలులో త్వరలో సాధికార బస్సు యాత్ర



స్థల పరిశీలన చేస్తున్న రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. త్వరలో కర్నూలు చేపట్టనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర సభ కోసం ఆదివారం నగరంలో స్థల పరిశీలన చేశారు. నగరంలోని పాతబస్టాండ్, కొండారెడ్డి బురుజు, పూల బజార్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలో త్వరలో సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చేసిన మేలును వివరించేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అహోబిలేశుని సేవలో రాష్ట్ర అటవీశాఖ సెక్రటరీ



అహోబిలేశుని సన్నిధిలో రాష్ట్ర అటవీ సెక్రటరీ చలపతిరావు

ఆళ్లగడ్డ: రాష్ట్ర అటవీశాఖ సెక్రటరీ చలపతిరావు ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. దిగువ అహోబిలం చేరుకున్న చలపతిరావు కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రహ్లాద వరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎగువ అహోబిలం సమీపంలోని సీతల్ బేస్ క్యాంప్ ఆవరణలో అటవీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుణ్యక్షేత్రాలు, గ్రామాల సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణకు దేవస్థానం నిర్వాహకులు, గ్రామస్తులను సమన్వయంతో అవగాహన కల్పించాలన్నారు. జీవవైవిధ్యం అలరారే నల్లమల అటవీ ప్రాంతంలోని జంతువుల సంరక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈయన వెంట రుద్రవరం అటవీ రేంజ్ అధికారి శ్రీపతినాయుడు ఉన్నారు.

రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం

● వివాదాస్పదంగా మారిన స్థల పంచాయతీ



గాంధీనగర్‌లో రోడ్డుకు అడ్డంగా నిర్మిస్తున్న గోడ

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీనగర్‌కు వెళ్లే రహదారిలో స్థల పంచాయతీ వివాదాస్పదంగా మారింది. ఆదివారం ఇంటి యజమాని ఏకంగా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణ పనులు చేపట్టాడు. కాలనీ ఏర్పాటైనప్పటి నుంచి గాంధీనగర్‌కు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు ఈ ప్రాంతంలో సీసీరోడ్డును ఏర్పాటు చేశారు. అయితే స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలో ఇరువురు వ్యక్తులకు ఉన్న ఇల్లు, స్థలానికి సంబంధించి కొన్ని రోజుల నుంచి వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో గాంధీనగర్‌లోకి వెళ్లేందుకు రోడ్డు లేదని ఆ స్థలమంతా తననేనంటూ ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణ పనులు ప్రారంభించాడు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ దారి మార్గాన వెళుతున్నామని, గ్రామ పంచాయతీ అధికారులు వేసిన రోడ్డుకు అడ్డంగా గోడను ఎలా నిర్మిస్తారని కాలనీ వాసులు ప్రతిఘటించి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గోడ నిర్మాణంపై గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు విచారణ జరుపుతున్నారు.

రమణీయం.. రథోత్సవం



అశేష జనవాహిని మధ్య సాగుతున్న శ్రీరామదాసు స్వామి రథోత్సవం

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి గ్రామంలో వెలసిన శ్రీరామదాసు రథోత్సవం ఆదివారం సాయంత్రం రమణీయంగా సాగింది. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల హరిచక్రపాణిరెడ్డి, కోట్ల కాసిక్‌రెడ్డిలు హాజరై పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రజలు గోవింద నామస్మరణలతో రథంపై పూలవర్షం కురిపించారు. స్వామి వారి రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే గాక ఇతర జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చి సామివారిని దర్శించుకున్నారు.

టీబీ డ్యాంలో 12 టీఎంసీల నీరు



టీబీ డ్యాంలో నిల్వ ఉన్న నీరు

హొళగుంద: ఉమ్మడి జలాశయం, కర్ణాటక రాష్ట్ర హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో 1,591 అడుగుల వద్ద 12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి డ్యాం పూర్తి సామర్థ్యం 1,633 అడుగులకు గాను 1,628 అడుగులతో 105.788 టీఎంసీలకు గాను 88 టీఎంసీల నీరు నిల్వ ఉండింది. ఈ ఏడాది వర్షాభావం కారణంగా అతి తక్కువ నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కేవలం 694 క్యూసెక్కులుండి అవుట్‌ఫ్లో 2,490 క్యూసెక్కులుంది. టీబీ డ్యాం నుంచి జిల్లాలో ప్రవహించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) 250 కి.మీ వద్ద 450 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.


ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: మండలంలోని చింతకొమ్ముదిన్నె గ్రామ సమీపంలో ఆదివారం సుబ్బయ్య (35) అనే వ్యక్తి ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మృతుడు గ్రామ సమీపంలోని హైవే రోడ్డు వద్ద నిలబడి ఉండగా అతని ముందు ఆగి ఉన్న ట్రాక్టర్ ఉన్నట్టుండి వెనుకు వచ్చి సుబ్బయ్యపై ఎక్కింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడని రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వీధి కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్

● పైలట్ ప్రాజెక్ట్ కింద కర్నూలు నగరంలోని వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు
● విస్తరిస్తున్న వీధి కుక్కల కట్టడికి నవోదయ వెట్ సొసైటీతో కలిసి ప్రభుత్వం కార్యాచరణ

వీధి కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. పైలట్ ప్రాజెక్ట్ కింద కర్నూలు నగరంలోని వీధి కుక్కలకు నవోదయ వెట్ సొసైటీతో ద్వారా ప్రభుత్వం శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ వాటి సంతతి వృద్ధికి అడ్డుకట్టు వేస్తోంది. 2021 నుంచి ఇప్పటి వరకు 6,822 కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేశారు.



వీధి కుక్కకు శస్త్రచికిత్స చేస్తున్న దృశ్యం



కర్నూలులో నిర్మించిన వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రం



ఫ్యామిలీ ప్లానింగ్ చేసిన కుక్క చెవిని వి ఆకారంలో కట్ చేసిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వీధి కుక్కల స్వైరవిహారాన్ని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా 2021 నుంచి వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. పైలట్ ప్రాజెక్టుగా కర్నూలులో వీధి కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు ముమ్మరగా సాగుతున్నాయి. త్వరలో నంద్యాలలో కూడా ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదోని మున్సిపాలిటీలో గతంలోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

నవోదయ వెట్ సొసైటీ సహకారంతో..

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 20 వేల వరకు వీధి కుక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. వీధి కుక్కల నియంత్రణలో నవోదయ వెట్ సొసైటీ కీలకంగా వ్యవహరిస్తోంది. వెటర్నరీ ఆఫీసర్ పర్యవేక్షణలో కుక్కలను పట్టడం, వాటికి గార్గేయపురం దగ్గరనున్న డంప్ యార్డు వద్ద వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసింది. అక్కడ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించడం, అవసరమైన మందులు, ఆహారం తదితర వాటిని నవోదయ వెట్ సొసైటీనే నిర్వహిస్తోంది. సొసైటీ ఏర్పాటు చేస్తుకున్న పశువైద్యుడే 2021 నుంచి ఇప్పటి వరకు 6,822 వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేశారు. కాగా 2021–22, 2022–23లో ఒక కుక్కకు రూ.1,450 చొప్పున, 2023లో కుక్కకు రూ.1,650 ప్రకారం నవోదయ వెట్ సొసైటీకి కార్పొరేషన్ చెల్లించింది.

ఆరు నెలల పైబడిన కుక్కలకే ఆపరేషన్..

ఆరు నెలల వయస్సు పైబడిన కుక్కలకే శస్త్రచికిత్సలు చేస్తారు. గర్భంతో ఉన్న కుక్కలకు శస్త్రచికిత్సలు చేయరు. గర్భంతో ఉందా.. లేదా అని నిర్ధారించిన తర్వాతే ఆపరేషన్ చేస్తారు. ఆడ కుక్కలకు ట్యూబెక్టమీ, మగ కుక్కలకు వేసెక్టమీ ఆపరేషన్‌లు చేస్తారు. ఆపరేషన్ చేసిన కుక్కలను గుర్తించేందుకు చెవిలో కొంత భాగాన్ని vఆకారంలో కట్ చేస్తారు. శస్త్రచికిత్స నుంచి కుక్క పూర్తిగా కోలుకున్న తర్వాత రేబిస్ వ్యాక్సిన్ వేసి ఎక్కడైతే కుక్కను పట్టుకున్నారో.. అక్కడే వదిలేస్తారు.

పెంపుడు కుక్కలకు కూడా..

పట్టణ ప్రాంతాల్లో ఇంటికి రక్షణగా వివిధ జాతుల కుక్కలను పోషిస్తున్నారు. కుక్కల పెంపకం హాబీగా కూడా మారింది. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా 3 నెలల వయస్సులో టీకాలతో పాటు ఏటా బూస్టర్ డోస్ వేయించాలి. ఆరు నెలల తర్వాత జనన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలని పశుసంవర్ధకశాఖ అధికారులు యమజానులకు అవగాహన కల్పిస్తున్నారు.

పకడ్బందీగా వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు



నవోదయ వెట్ సొసైటీ ద్వారా నగరపాలక సంస్థలో విధి కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ చేస్తున్నాం. రోజుకు సగటున 20 వరకు వీధి కుక్కలకు గార్గేయపురం సమీపంలోని డంప్ యార్డు వద్ద నిర్మించిన వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రంలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం. ఆపరేషన్ తర్వాత వాటి పరిస్థితి పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ మల్లన్న, వెటర్నరీ ఆఫీసర్, కర్నూలు